అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ఉల్లి, టమోటా రైతులను ఆదుకోవాలి

- ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- కర్నూలు ఉల్లి, పత్తికొండ టమోటా మార్కెట్ల సందర్శన
- ఆదోని మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు పరిశీలన

టమోటా మార్కెట్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు కష్టాలను వివరిస్తున్న మహిళా రైతు

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్/కార్పొరేషన్/ పత్తికొండ/ ఆదోని

కర్నూలు జిల్లాలో ఉల్లి, టమోటా పంటలు సాగు చేస్తున్న రైతులకు కనీస మద్దతు ధరలు కల్పించి ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు జిల్లాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటించారు. ముందుగా కర్నూలులోని ఉల్లి మార్కెట్‌యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఉల్లి రైతులు తమ కష్టాలను, బాధలను వి.శ్రీనివాసరావు చెప్పుకున్నారు. 'ఉల్లి పంట సాగు చేసేందుకు ఎకరాకు దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హెక్టార్‌కు రూ. 50 వేలు ఆర్థిక సాయం ఏ మూలకు సరిపోదు. ఇప్పుడు మార్కెట్‌కు తెచ్చిన ఉల్లిని ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని ప్రకటించడం దుర్మార్గం. మా పరిస్థితి కడు దయనీయంగా ఉంది' అంటూ ఉల్లి రైతులు వి.శ్రీనివాసరావుతో కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం వి.శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. ఉల్లి రైతులకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3 వేలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వి.శ్రీనివాసరావు పత్తికొండ పట్టణానికి చేరుకుని టమోటా మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. టమోటా పంట సాగు చేయడానికి అయిన పెట్టుబడి ఖర్చులను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళా రైతు టమోటాకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టమోటా వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడం దుర్మార్గమని మండిపడ్డారు. టమోటాను కిలో రూ.25 చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన ఆదోని మండలం ఆరేకల్ వద్ద చేరుకుని మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై పెట్టిన కేసులను ప్రభుత్వం భేషరతుగా ఎత్తివేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశ మాట్లాడుతూ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ఐక్య ఉద్యమాలకు వైసీపీ నాయకులు సంసిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, పి.నిర్మల, ఎండి ఆనంద్ బాబు, ఎండి అంజిబాబు, కె.వి నారాయణ, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రంగారెడ్డి, సూరి, మధు, గంగన్న, గురు శేఖర్, హుస్సేన్, వీరశేకర్, రామంజినేయులు, లక్ష్మణ్, గోపాల్, లింగన్న, రంగారెడ్డి, వీరశేఖర్, చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, తిప్పన్న, వీరారెడ్డి, రామాంజనేయులు, వీరేశ్, వెంకటేష్, నగరాజ్, వెంకటేష్, నాగేంద్ర, కృష్ణ మూర్తి, హనుమంతు, నారాయణ స్వామి, అజిమ్ ఖాన్, ఈగబల్ పాల్గొన్నారు.

అర్జీదారులను తిప్పించుకోవద్దు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అర్జీదారులను పది సార్లు తిప్పించుకోవద్దని, చేయగలిగిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించారు. అనంతరం ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ కేసులు రీ ఓపెన్ అవుతున్నాయన్నారు. జిల్లాలో బివిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ బాగోలేదని, ఇందులో పురోగతి తీసుకు రావాలన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా సర్వీసులు బాగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల బయట లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలతో బట్టలు ఉతికించకూడదని, వాషింగ్ మెషీన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భోజనం నాణ్యతతో లేదనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలకు తక్షణ సహాయం అందించడానికి వన్ స్టాప్ సెంటర్

ఆపదలో ఉన్న మహిళలు, బాలికలకు తక్షణ సహాయం అందించడానికి వన్ స్టాప్ సెంటర్ అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకం వన్ స్టాప్ సెంటర్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.విజయ, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ విజయ లక్ష్మి, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ ఓ.మేరీ స్వర్ణలత, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

అక్టోబర్ 2న జరిగే దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో దేవరగట్టు బన్ని ఉత్సవాల నిర్వహణపై ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బన్ని ఉత్సవాలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... అవసరమైన ప్రదేశాలలో బ్యారికేడింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్సైజ్, పోలీస్ శాఖ సమన్వయంతో నాటు సారా, మద్యం నియంత్రించే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను కలెక్టర్, ఎస్పీ, సబ్ కలెక్టర్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

పచ్చని భూములపై కార్పొరేట్ కన్ను

- కర్నూలు జిల్లాలో పవర్ గ్రిడ్ కోసం 192 ఎకరాలు భూసేకరణ
- భూములు ఇచ్చేది లేదంటున్న అన్నదాతలు

ప్రజాశక్తి-ఆలూరు

"మేము సన్నకారు రైతులం.. మా కుటుంబానికి మూడెకరాల పొలం ఉంది. భర్త చనిపోయాడు..నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉన్న భూమిలో 1.20 ఎకరాలు పవర్ గ్రిడ్ తీసుకుంటే మేము ఎలా బ్రతకాలి" అంటూ ఆలూరు మండలం మనేకుర్తి గ్రామానికి ఎం లక్ష్మమ్మ వాపోయారు. ఇలాంటి పరిస్థితే కర్నూలు జిల్లాలోని ఆలూరు మండలం మనేకుర్తి, కమ్మరచేడు గ్రామాల్లోని 74 మంది రైతుల నుంచి వ్యక్తం అవుతోంది..

ప్రజా ప్రయోజనం కోసం అభివృద్ధి చేపడుతున్నామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చని పంట పొలాలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నాయి. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో పచ్చని పైర్లతో కళకళలాడే పంట పొలాలపై కార్పొరేట్ కన్ను పడింది. మనేకుర్తి, హులేబీడు, కమ్మరచేడు గ్రామాల రెవెన్యూ పరిధిలో 192 ఎకరాల సాగు భూమిని రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేసేందుకు సమాయత్తం అవుతోంది. మనేకుర్తికి చెందిన రైతుల నుండి 94.64 ఎకరాలు, హులేబీడు గ్రామానికి చెందిన 82.11 ఎకరాలు, కమ్మరచేడు గ్రామానికి చెందిన 15.016 ఎకరాలు భూసేకరణ చేయాలని నిర్ణయించింది. మొత్తం 74 మంది రైతుల నుంచి భూమి తీసుకోవాలని అనుకోగా 60 మంది రైతులు భూములు ఇవ్వబోమని వ్యతిరేకిస్తున్నారు.

పారదర్శకత లేని ప్రక్రియ

భూసేకరణకు ముందు అధికారులు ఎకరాకు రూ.6 లక్షలు ఇస్తామని చెప్పగా రైతుల నుండి ప్రతిఘటన ఎదురుకావడంతో ఏకంగా రూ.18 లక్షలు పెంచారు. ఇలా భూమికి ధరను పెంచి నిర్ణంచడంలో అంతర్యామేమిటోననే సందేహం వ్యక్తం అవుతోంది.

బలవంతపు భూసేకరణను తొలి నుంచి అన్నదాతలు అడ్డుకుంటున్నారు. ఈ ఏడాది జులై నెలలో కంపెనీ అధికారులు, రెవెన్యూ అధికారులెవరూ రైతులను సంప్రదించకుండానే హైకోర్టు లాయర్ ద్వారా రైతులకు కెవిటి నోటీస్ పంపించారు. ఆగస్టు12న మనేకుర్తి గ్రామంలో పవర్ గ్రిడ్‌లో భూములు కోల్పోతున్న రైతులతో గ్రామ సర్పంచ్ అధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో పవర్ గ్రిడ్ నిర్మాణకి భూములు ఇవ్వాలని కోరగా రైతులు రెండు పంటలు పండే సారవంతమైన భూములు ఇవ్వబోమని రైతులు సంతకాలు చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అయితే ఆగస్టు 25న కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి భూసేకరణలో కోల్పోతున్న రైతులు వారి పొలాలకు సంబంధించిన ప్రకటన ప్రచురించిన దాని చూసి రైతులు ఆందోళన చెందారు. 28న పవర్ గ్రిడ్ కంపెనీ వారితో పాటు ప్రజాభిప్రాయసేకరణకు వచ్చిన ఆర్డిఓ భారత్ నాయక్ రైతులు తమ అభిప్రాయం తెలపమని చెబుతూనే రైతులు స్వచ్చందంగా భూములు ఇస్తే రూ.18 లక్షలు వస్తాయని, లేదంటే జనరల్ యాక్టివ్ కింద రూ.6 లక్షలు ఇస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. రైతులందరు ముక్తకంఠంతో భూములు ఆర్డిఓకు తేల్చి చెప్పారు.

తీవ్రమవుతున్న ఆందోళనలు

బలవంతపు భూ సేకరణ ఆపాలని ఆగస్టు 31న గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పై ఆలూరు ఎంఎల్‌ఏ విరుపాక్షి, ఆదోని మాజీ ఎంఎల్‌ఏ సాయిప్రసాద్ రెడ్డి అధ్వర్యంలో రాస్తోరోకో చేపట్టారు. ఈ నెల 1న పత్తికొండ ఆర్డిఓ కార్యాలయంలోఎపి రైతుసంఘాల ఆధ్వర్యంలో మనేకుర్తి గ్రామ రైతులు ధర్నా చేపట్టారు. రైతుల పోరాటానికి మద్దతుగా రైతు సంఘాలు, వామపక్ష పార్టీలు అండగా నిలబడుతూ బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేస్తున్నాయి.

మనేకుర్తి గ్రామంలోని పచ్చని పంట పొలాలు

ప్రజాభిప్రాయ సేకరణలో పొలాలు ఇవ్వబోమని వాగ్వాదం చేస్తున్న రైతులు (ఫైల్)

పోరాడి మా భూములు సాధించుకుంటాం

పవర్ గ్రిడ్‌కు ఉన్న భూమిని ఇచ్చి ఊరును వదిలి పెట్టి వెళ్లినా, డబ్బులున్నా భూమి లేకపోతే ఆత్మహత్యలు తప్ప మాకు వేరే మార్గం లేదు. అందుకే మా భూములను లాక్కుంటే పోరాడి అయినా సాధించుకుంటాం.

- చిన్న ఆంజనేయ, మనేకుర్తి, ఆలూరు మండలం.

బలవంతంగా భూములు లాక్కోవద్దు

పవర్ గ్రిడ్ ద్వారా మనేకుర్తి గ్రామ రైతులకు ఎటువంటి ప్రయోజనం లేద. ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలి. రైతులు స్వచ్చందంగా ఇస్తేనే తీసుకోవాలి. లేదంటే రైతు సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అడ్డుకుంటాము.

- పి.హనుమంతు, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు.

వైద్య విద్యలో సామాజిక దృక్పథం అవసరం

- కెఎమ్‌సి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వైద్య విద్య ఉన్నతమైందని, వైద్య విద్య సామాజిక దృక్పథం అవసరమని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం తరగతులను సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు మెడిసిన్ సీటు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరిచయం నిర్వహించారు. అడిషనల్ డిఎంఇ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ హరి చరణ్, డాక్టర్ రేణుక దేవి, డాక్టర్ విజయానంద్ బాబు, స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, రీజినల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కో ఆర్డినేటర్, అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సింధియా శుభప్రద పాల్గొన్నారు. అలాగే కర్నూలు మెడికల్ కళాశాలలోని ఫార్మకాలజీ విభాగంలోని 'ఔషధ దుష్ప్రభావాల పర్యవేక్షణ కేంద్రం' ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాల గోడ పత్రికను మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ ఆవిష్కరించారు. ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి, అసోసియేట్లు డాక్టర్ రాజేశ్వరమ్మ, డాక్టర్ రజనీకాంత్, అసిస్టెంట్లు డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ హరిత, డాక్టర్ రమ్య, డాక్టర్ అల్తాఫ్, డాక్టర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలకిచ్చిన హామీలు అమలు చేయాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లులో ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఐద్వా సీనియర్ నాయకులు టి.నాగమ్మ అధ్యక్షత వహించారు. మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.పద్మావతి, జి.లలితమ్మ, సహాయ కార్యదర్శులుగా జి.తిమ్మక్క, బి.రమాదేవి, ఉపాధ్యక్షులుగా ఎస్.లక్ష్మి, సభ్యులుగా షహరబీ, గోవిందమ్మ, సుబ్బమ్మ, రాధమ్మ, పద్మావతమ్మను ఎన్నుకున్నారు. గిడ్డమ్మ, శోక్రాబీ, సుబ్బమ్మ, రోకాబీ పాల్గొన్నారు

ఉల్లికి గిట్టుబాటు ధర కరువు

- వైసిపి నాయకులు ఎస్వీ.మోహన్‌రెడ్డి, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్

ప్రజాశక్తి - కోడుమూరు

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి, నాయకులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ మండిపడ్డారు. ఉల్లికి గిట్టుబాటు ధరను ఎత్తేసి పరిహారం చెల్లిస్తామనే ప్రభుత్వ ప్రకటనపై రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో రైతులు ఆందోళన చేపట్టారు. వైసిపి నాయకులు సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ... గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న ఉల్లి రైతులు చివరకు పంటను రోడ్లపై పారేస్తున్నారని తెలిపారు. ఉల్లి ఎకరాకు దాదాపు 100 క్వింటాళ్ల వరకు పండుతుందని, క్వింటా ఉల్లికి ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రూ.1,200 అని, ఆ ప్రకారం ఒక హెక్టార్‌లో పండే ఉల్లికి రైతులకు రూ.3 లక్షల ఆదాయం రావాలని చెప్పారు. ప్రభుత్వం హెక్టార్‌కు రూ.50 వేల పరిహారం ఇస్తామని చెబుతోందని తెలిపారు. అలా ఇచ్చినా, ఉల్లి రైతు ఒక్కో ఎకరాకు రూ.80 వేల చొప్పున నష్టపోతారని చెప్పారు. వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి

- కార్మిక సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 13 గంటల పని విధానాన్ని నిరసిస్తూ, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు, ఎఐటియుసి నగర కార్యదర్శులు ఎం.విజయ, చంద్ర శేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజి బాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్‌లు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకి, పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎనిమిది గంటల పని విధానం, ఉద్యోగ భద్రత, సమ్మె హక్కు లాంటి అనేక కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందని విమ ర్శించారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలు అమలు చేయాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులతో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు సాయిబాబా, నరసింహులు, యేసు, రాధాకృష్ణ, మహమూద్, కుమార్, ఎఐటియుసి నగర నాయకులు టి.రామాంజనేయులు, ఏ.ఈశ్వర్, ఆర్.కృష్ణారెడ్డి, రాము, గణేష్, ఎం.నల్లన్న, తదితరులు పాల్గొన్నారు. **పత్తికొండ** పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి స్థానిక నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. సిఐటియు మండల అధ్యక్షులు డి.గోపాల్, ఎఐటియుసి మండల అధ్యక్షులు నెట్టెకంటయ్య అధ్యక్షత వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర, వ్యకాస నాయకులు సిద్ధయ్య గౌడ్, పిఎస్ఎం నాయకులు ఖాసీం, ఎఐటియుసి మండల కార్యదర్శి ఎం.రంగన్న, సిపిఐ నాయకులు డి.రాజా సాహెబ్, కారుమంచి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిఐటియు మద్దికెర మండల కార్యదర్శి బురుజుల రాముడు, పిఎస్ఎం మండల కార్యదర్శి రమేష్, బజారు హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉరుకుంద, రామాంజనేయులు, సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, హమాలీ సంఘం నాయకులు సుంకన్న, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, పెద్ద వీరన్న పాల్గొన్నారు. **కోడుమూరు**లోని కోట్ల సర్కిల్‌లో ఆందోళన చేపట్టారు. ఆటో యూనియన్ నాయకులు మధు అధ్యక్షత వహించారు. ఎఐటియుసి నాయకులు చిన్న రాముడు, సిపిఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ కార్యదర్శి శేషు కుమార్, చేనేత కార్మిక సంఘం నాయకులు మాధవ స్వామి, సిపిఎం సీనియర్ నాయకులు గఫూర్‌మియ్యా, సిఐటియు నాయకులు ఈరన్న, ఎఐటియుసి నాయకులు గడ్డం నాగరాజు, మద్దిలేటి, హమాలీ నాయకులు శంకర్, దాము, మణి, సుంకన్న, నాగేష్, ఆటో యూనియన్ నాయకులు రామాంజనేయులు, నాగరాజు, ఖాజా, రాజేష్, గిరి, లక్ష్మన్న, చలపతి, శేషు, చేనేత కార్మిక సంఘం నాయకులు బాష, రైతు సంఘం నాయకులు గొల్ల రాజు పాల్గొన్నారు.



కర్నూలులో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కుళ్లిన ఉల్లి - డంప్ యార్డుకు తరలింపు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ ద్వారా క్వింటా రూ.1,200 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి తడిసిపోయి కుళ్లిపోవడంతో ఆ బస్తాలను డంపు యార్డుకు తరలించారు. రైతుల నుంచి ప్రభుత్వం కొన్న ఉల్లిని ఒక్కో రేషన్ కార్డుకు 10 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేసిన పేదలు శుభ్రం చేసుకుని ఇంట్లో ఆరబెట్టుకొని ఉపయోగించుకునే వారని పలువురు చెబుతున్నారు. ప్యాకెట్ రూ.50 నుంచి రూ.100 వరకు ప్రయివేట్ వ్యక్తులకు అమ్మగా మిగిలిపోయిన ఉల్లి అంతా వర్షానికి తడిసి కుళ్లిపోయింది.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజల వినతులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 65 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతులకు, సాగుదారులకు నష్టపరిహారం ఇవ్వాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎపిఐఐసిలో భూములు కోల్పోయిన రైతులు ఓర్వకల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతు సంఘం మండల నాయకులు ఎస్.మధుసూదన్ అధ్యక్షత వహించారు. నాగన్న మాట్లాడుతూ... ఎపిఐఐసి పేరుతో 10 వేల ఎకరాలకు పైగా భూములను సేకరించారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి రైతుల భూములను పరిశీలించి ఎవరెవరికి ఎంత భూములు ఉన్నాయో గుర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు

నీటి సమస్యను పరిష్కరించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉల్చాల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం డివైఎఫ్ఐ కర్నూలు మండల నాయకులు అంజి అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ... కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సిరికి వినతిపత్రం అందజేశారు... కలెక్టర్ మాట్లాడుతూ... సంబంధిత అధికారులకు చెప్పి సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రకాష్, మండల నాయకులు హరి కిషన్ రెడ్డి, రాము, గోవర్ధన్, విశ్వ, శ్రీను, గ్రామస్తులు ఇస్మాయిల్, భీమేష్, మద్దిలేటి, కృష్ణ, నాగన్న, వంశీ, రవి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే చర్యలు

- కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్ హెచ్చరించారు. కర్నూలు ఆర్‌టిసి బస్టాండు, రైల్వే స్టేషన్‌లో కర్నూలు పోలీసులతో కలిసి నాకాబంధీ నిర్వహించారు. ఎక్కడైనా సమస్యలుంటే ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. అనంతరం కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్తున్న రైలులో తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని పార్శిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. టూ టౌన్ సిఐ నాగరాజారావు, నాలుగో పట్టణ సిఐ విక్రమసింహా, టూ టౌన్ ఎస్ఐ సతీష్ కుమార్ యాదవ్, నాలుగో పట్టణ ఎస్ఐ రామ మునెయ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణదారులతో ఎఒ సమీక్ష

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని ఎరువులు, మందుల దుకాణదారులతో ఎఒ మల్లేష్ కుమార్ సోమవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... నానో యూరియా, నానో డిఎపి వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువులు, మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇచ్చి నాణ్యమైనవే అందించాలని చెప్పారు.

60 అడుగుల రోడ్లను అభివృద్ధి చేయాలి

- పిపిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

స్థానికులు అడుగు తీసి అడుగు వేయడానికి అవకాశం లేని 60 అడుగుల విస్తీర్ణం గల రోడ్లను అభివృద్ధి చేసి ప్రజల ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఈ.పుల్లారెడ్డి, మహ్మద్ యూనుస్, ఎస్.రమణ గౌడ్, ఎల్.నయీం కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ మీదుగా వెళ్లి నందికొట్కూర్ రోడ్డులో కలిసే 60 అడుగుల రోడ్డును నిర్మించాలని అధికారులను కోరుతున్నా స్పందించడం లేదని తెలిపారు. అదే ప్రాంతంలో రోడ్డు పక్కన రోడ్డు.. రోడ్డు మధ్యలో డివైడర్‌ను తొలగించి కొత్త డివైడర్ నిర్మించారని చెప్పారు. ఇలాంటి అత్యవసరం లేని అభివృద్ధి పనులు చేసి రూ.కోటికి పైగా వృథా చేశారని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ... అభివృద్ధి కార్యక్రమాలు నగరమంతా ఒకే విధంగా చేస్తామన్నారు. నడవడానికి వీల్లేని రోడ్ల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అక్కడే ఉన్న ఇంజినీర్లకు ఆదేశాలు ఇచ్చారు.

డిగ్రీ కళాశాలల బంద్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రయివేట్ డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిగ్రీ కళాశాలలు బంద్ పాటించాయి. కర్నూలులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల సహా అనేక కళాశాలలు ఈ బందులో పాల్గొన్నాయి. సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ వై.శౌరీలు రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సి.వెంకట సత్యనారాయణ మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్లు సకాలంలో చెల్లించకపోవడంతో కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్‌లో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

బంద్ పాటిస్తూ మాట్లాడుతున్న శౌరీలురెడ్డి

దేవనకొండలో స్వాగతం పలుకుతున్న సిపిఎం నాయకులు

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారమయ్యే వరకు పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కర్నూలు ఉల్లి మార్కెట్ యార్డు, పత్తికొండ టమోటా మార్కెట్ను పరిశీలించడానికి శ్రీనివాసరావు వచ్చారు. మండలంలోని కోవెలమ్మ గ్రామం నుంచి సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ నాయకత్వంలో ప్రజాసంఘాల కార్యకర్తలు బైక్‌లతో దేవనకొండ వరకు ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. దేశానికి అన్నం పెట్టే రైతును ఆదుకోవాలని, రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉల్లి, టమోటా, పత్తి రైతులను ఆదుకోవాలని, రైతుల పక్షాన వర్గాలు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు. నేటి పాలకుల నిరంకుశ వైఖరి పై యువత అప్రమత్తంగా ఉండాలని, కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని దోచిపెడుతున్న ప్రభుత్వాల వైఖరిని ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. మండలంలోని రైతు సమస్యలపై, ప్రధానంగా సాగు, తాగునీరు, ప్రజా మౌలిక సదుపాయాలపై, విద్య, వైద్యం, రోడ్లు, ప్రజల జీవన ప్రమాణాలపై ఉద్యమాలు కార్యక్రమం ముందుండాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ, రామక్రిష్ణ, కెవి.నారాయణ, జిల్లా నాయకులు రాజశేఖర్, గురు శేఖర్, రంగప్ప, అమర్, మండల నాయకులు అశోక్, యూసుఫ్ బాష, మహబూబ్ బాషా, నూరి, పెద్దరంగయ్య, మహేంద్ర, నాగేంద్ర, పాండు, శ్రీనివాసులు, వీరేంద్ర, సుధాకర్ రవీంద్ర, కెపి.రాముడు, నాగేంద్ర, ఖాసీం, బడే సాబ్, బలరాముడు, ఆస్పరి మండల నాయకులు రంగస్వామి, రామాంజనేయులు, రవి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

- చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పట్టణంలోని శివన్న నగర్ ఎల్ లైన్ వీధిలో మౌలిక వసతులు కల్పించాలని ఏపి చేనేత కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి బి.కాశప్ప, పట్టణ నాయకులు కె.కృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆగస్టు 7న చేనేత జాతీయ దినోత్సవం ఎంతో ఆర్భాటంగా జరిపిన పాలకులు క్షేత్రస్థాయిలో చేనేత కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈనెలలో పేర్కొంటే ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. వర్షాకాలం చేనేత కార్మికుల గృహాల్లోకి, మగ్గంలోకి వర్షపు నీరు వస్తోందని, ఉపాధి కరువవుతోందని చెప్పారు. ఈ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో జీవనం కొనసాగిస్తున్నామని వాపోయారు. ఎమ్మెల్యే కమిషనర్ తమ వీధులను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. చేనేత కార్మిక సంఘం నాయకులు నాగరాజు, ఎల్లప్ప, ఉమమ్మ, జయలక్ష్మి, కామాక్షి, పరిమళ, లక్ష్మన్న, శీను పాల్గొన్నారు.

'13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి'

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ స్కూల్ గ్రౌండ్ నుంచి భీమాస్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అజయ్ బాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి వెంకన్న, ఒపి నాగరాజు, సిఐటియు నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.గోపాల్, తిప్పన్న, లక్ష్మన్న, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జి.ఎంకప్ప, నాయకులు కుమార్ మాట్లాడారు. అధికారంలోకి వస్తే పని భారం తగ్గిస్తామని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారని తెలిపారు. బిజెపి మెప్పు కోసం రాష్ట్రంలో ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ద్వారా 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారని తెలిపారు. కార్మికులు, మహిళలు, ఉద్యోగులు, కార్పొరేట్ ప్రయివేట్ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ఐక్యమత్యంగా పోరాడాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు కృష్ణమూర్తి, అజీమ్ ఖాన్, భీమేష్, షేక్షావలీ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉత్కంఠకు తెర..!

- టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జిగా వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి - ఆలూరు

ఏడాదికి పైగా టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి పదవిపై జరుగుతున్న పోరుకు అధిష్టానం తెరదించింది. ఆలూరు కొత్త ఇన్‌ఛార్జి నియామకంపై టిడిపి కేడర్‌లో ఉన్న అయోమయం తొలగిపోయింది. కొంతకాలంగా ఆలూరు తాలూకాలో వీరభద్రగౌడ్, వైకుంఠం జ్యోతి రెండు గ్రూపులుగా పార్టీ కార్యక్రమాలు చేపట్టారు. ఆలూరులో టిడిపి గ్రూపు పోరు నిర్మూలించడంతో అధిష్టానం త్రీ మ్యాన్ కమిటీని నియమించింది. త్రీ మ్యాన్ కమిటీని నియమించినప్పటికీ వీరభద్ర గౌడ్, వైకుంఠం జ్యోతి పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించడంతో త్రీ మ్యాన్ కమిటీ సభ్యులకు కూడా ఇబ్బందిగా మారింది. ఒకానొక దశలో టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, పార్టీ పరిశీలకులు పూల నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, ఎంపీ నాగరాజు వీరభద్ర గౌడ్‌ను ఇన్‌ఛార్జిగా తొలగించినట్లు ప్రకటించారు. తనకే అధిష్టానం అండదండలు ఉన్నాయంటూ వీరభద్ర గౌడ్ తన గ్రూపు కేడర్‌లో జోష్ నింపేందుకు ప్రయత్నించారు. గత కొద్దికాలంగా స్తబ్దుగా ఉన్న వైకుంఠం జ్యోతి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించడంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇలా పార్టీ కార్యక్రమాలు నిర్వహించే సమయంలో అధిష్టానం ప్రకటనతో వీరభద్ర గౌడ్ గ్రూపులో తాజాగా సందిగ్ధం పెద్ద చంచలం మారింది.

టిడిపి వెంటే ఉన్న వైకుంఠం ప్రసాద్

వైకుంఠం అంటే టిడిపి.. టిడిపి అంటే వైకుంఠం అన్నట్లుగా ఆలూరు నియోజకవర్గంలో పేరొందిన వైకుంఠం శ్రీరాములు కుటుంబం. 2009 నుంచి 2014 వరకు ఆలూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా కొనసాగిన వైకుంఠం శివప్రసాద్.. 2014లో ఎమ్మెల్యే టికెట్ ఆశించినా.. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు వీరభద్రగౌడ్‌కు సీటు కేటాయించారు. పార్టీలోనే కొనసాగుతూ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2019లో వీరభద్ర గౌడ్, వైకుంఠం శివప్రసాద్ ఎమ్మెల్యే టికెట్ ఆశించగా అధిష్టానం కోట్ల సుజాతమ్మకు కేటాయించింది. పార్టీ ప్రతిపక్షంలో ఉండగా పార్టీ కార్యక్రమాలు చేపడుతూ యువగళంలో నారా లోకేష్‌తో జిల్లావ్యాప్తంగా పాదయాత్ర చేపట్టిన వైకుంఠం జ్యోతి అధిష్టానం దృష్టిలో పడ్డారు. 2024 ఎన్నికల్లో కూటమిలో భాగంగా కుటుంబంలో ఒకరికి సీటు అని టిడిపి అధిష్టానం ఆదేశించడంతో కోట్ల కుటుంబానికి డోన్ కేటాయించడంతో ఆలూరు బీసీలు ఎక్కువగా ఉండడంతో మళ్లీ వీరభద్రగౌడ్‌కే ఎమ్మెల్యే టికెట్ కేటాయించారు. ఎన్నికల సమయంలో, ఎన్నికల తర్వాత టిడిపి సీనియర్ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడంలో విఫలం చెందారని ఏడాదిగా ఇన్‌ఛార్జిగా ఉన్న వీరభద్ర గౌడ్‌ను తొలగించారు. వైకుంఠం జ్యోతిని ఇన్‌ఛార్జిగా నియమించడంతో టిడిపి కేడర్‌లో నూతన ఉత్తేజం నిండి.. బాణసంచాలతో సంబరాలు జరుపుకున్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉన్న వైకుంఠం దంపతులు

సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి

- టిడిపి ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి

తనను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నారా లోకేష్‌కు, అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్‌కు వైకుంఠం జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉన్నా ఆలూరులో టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరాశతో ఉన్నారని తెలిపారు. పార్టీ అభివృద్ధికి పార్టీ సీనియర్ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు.

వైకుంఠం దంపతులకు సముచిత స్థానం

ప్రజాశక్తి - చిప్పగిరి

టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం విశేష సేవలందించిన కీర్తిశేషులు వైకుంఠం శ్రీరాములు రెండో కోడలు వైకుంఠం జ్యోతి టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. సోమవారం నియోజకవర్గంలోని చిప్పగిరి, ఆలూరు, హాలహర్వి, హోళగుంద, దేవనకొండ, ఆస్పరి మండలాల్లో వైకుంఠం అభిమానులు, నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. వైకుంఠం శ్రీరాములు కుటుంబం టిడిపికి విశేష సేవలందించింది. నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గం ఎక్కువగా ఉండడంతో పార్టీ వారికి టికెట్ కేటాయించడంలో సముచిత స్థానం కల్పించలేకపోయింది. వైకుంఠం శ్రీరాములు చిన్న కుమారుడు వైకుంఠం శివప్రసాద్, జ్యోతి దంపతులు పార్టీ కోసం కేడర్‌ను ఏకతాటిపై నడిపిస్తూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ వచ్చారు. పార్టీ వారి సేవలను గుర్తించి ఆలూరు ఇన్‌ఛార్జిగా వైకుంఠం జ్యోతిని నియమించింది. వైకుంఠం శివప్రసాద్, జ్యోతి దంపతులు మాట్లాడుతూ... తాము ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ... కేడర్‌ను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. తమ సేవలను గుర్తించి ఆలూరు పగ్గాలను కట్టబెట్టినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో టిడిపి కుటుంబ సభ్యులందరినీ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. చిప్పగిరిలో అంబేద్కర్ కూడలిలో టిడిపి నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

తండ్రి బాటలో తనయుడు : కీర్తిశేషులు వైకుంఠం శ్రీరాములు కుమారుడు వైకుంఠం శివప్రసాద్ తండ్రి బాటలో నడుస్తూ పార్టీకి సేవలందించారు. నియోజకవర్గంలో వైకుంఠం నియామకంతో నూతన ఉత్సవం నెలకొంది. తండ్రి ఆశయాలను కొనసాగిస్తామని, టిడిపి కేడర్‌ను అభివృద్ధి వైపు నడిపిస్తామని శివప్రసాద్, జ్యోతి తెలిపారు. **ఆస్పరి** మండలంలో వైకుంఠం గ్రూపు నాయకులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి మాజీ ఎంపిపిలు రత్నమ్మ, వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చౌరస్తా, బస్టాండులో బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. జనసేన మండల కన్వీనర్ అరవింద్, టిడిపి నాయకులు రఘు, జీవన్ కుమార్, వీరేష్, ప్రకాష్, సోమలింగ, కృష్ణ, మహానంది, అంపయ్య, రాజశేఖర్, ఈరప్ప, రవి పాల్గొన్నారు. **దేవనకొండ** టిడిపి కార్యాలయ ఆవరణలో టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో వైకుంఠం వర్గీయులు బానసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, రాజశేఖర్ గౌడ్, శాంతి కుమార్, మల్లెపల్లి రంగడు, మల్లికార్జున గౌడ్, నాగరాజు గౌడ్, గిడ్డయ్య గౌడ్, రాజగోపాల్ గౌడ్ పాల్గొన్నారు. **హోళగుంద** నియోజకవర్గంలో వైకుంఠం గ్రూపు నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

ఆస్పరిలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

దేవనకొండలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

బస్సు సౌకర్యం కల్పించాలి

- రోడ్డుపై గ్రామస్తులు, విద్యార్థులు ధర్నా

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలం ఎరిగేరి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరారు. సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి. విద్యార్థులు మాట్లాడుతూ... సమయానికి బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, విద్యార్థి బస్సు లేకపోవడంతో సమయానికి పాఠశాలకు, కళాశాలలకు చేరుకోలేకపోతున్నామని తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న బస్సుల్లో మహిళలతో నిండిపోయి ఉండడంతో బస్సు ఎక్కలేకపోతున్నామని చెప్పారు. బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆర్‌టిసి డిఎం వచ్చి హామీ ఇచ్చే వరకు ధర్నాను విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ధర్నా విరమించాలని కౌతాళం పోలీసులు కోరినా వినకపోవడంతో పోలీసులకు, గ్రామస్తులకు కాసేపు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామం నుంచి నిత్యం ఆదోని, కౌతాళానికి వందలాది మంది విద్యార్థులు, గ్రామస్తులు చదువు కోసమని, పనుల నిమిత్తం వెళుతుంటారని, బస్సు సౌకర్యం లేకపోవడంతో కళాశాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐ అశోక్ కుమార్ విద్యార్థుల సమస్యలు ఆర్‌టిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌టిసి అధికారులు సానుకూలంగా స్పందించి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

అధికారుల వైఫల్యంతోనే పట్టాలివ్వలేదు

- తహశీల్దార్ వద్ద రైతుల మొర

ప్రజాశక్తి - మంత్రాలయం

అధికారుల వైఫల్యంతోనే రైతులు అనుభవంలో ఉన్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రమాదేవికి 40 మంది రైతులు వినతిపత్రం అందజేశారు. బాధితులు కామాటి రాఘన్న, గనేకంటి రఘు మాట్లాడుతూ... తమ పెద్దల కాలం నుంచి సంబంధిత భూముల్లో సాగులో ఉన్నామని, దానికి సంబంధించిన గుత్త రసీదులు, పత్రాలు ఉన్నాయని తెలిపారు. 1975లో ఫారం5 నోటీసులు ప్రభుత్వ నుంచి ఇచ్చిన తర్వాత వచ్చిన సర్వే అధికారి, అప్పటి సర్పంచి శేషగిరిరావు, కరణం భక్తవత్సలం స్వామిలు బ్రాహ్మణులు కావడం వల్ల సర్వే కోసం వచ్చిన అధికారిని లోపలికి తీసికెళ్లి మాట్లాడిన తర్వాత రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి వెళ్లి పోయారని పేర్కొన్నారు. 1969-70 నాటి మఠం అధికారులు రైతులకు నోటీసులు ఇవ్వకుండా భూ సర్వే చేయించారని, అప్పుడే ఎఫ్ఎల్ఆర్ రిజిస్టర్ చేయించారని చెప్పారు. 1971లో ఆర్ఆర్ యాక్ట్ వచ్చిందని తెలిపారు. సాగులో ఎవరుంటే వారికే హక్కు కల్పించాల్సి ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు శ్రీమఠం వారికి తొత్తులుగా మారి వారికే భూములను అప్పగించే ప్రయత్నం చేశారని విమర్శించారు. 1975లో రైతుల పట్టాలు తీసుకొన్న శ్రీమఠం వారు 2006లో తహశీల్దార్‌గా పని చేసిన భాగ్యరేఖ ద్వారా సంబంధిత భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు పొందినట్లు తెలిపారు. ప్రస్తుతం రీ సర్వే చేస్తామని రెవెన్యూ అధికారులు దండోరా వేయించి అనుభవంలో ఉన్న తమకు నోటీసులు ఇవ్వకుండా శ్రీమఠం వారికి ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. రైతులు వీరయ్య శెట్టి, తిమ్మయ్య, ఎంపిటిసి మేకల వెంకటేష్, మేకల నరసింహ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: KURNOOL
E.P.No. 6/2021 in L.A.O.P.No.: 27/2005

K. Bramaiah. ...D.Hr

- VS -

The Special Deputy Collector, S.S.P.
Land Acquisition and Rehabilitation. ...JDr

వేలం ప్రకటన

పై నెంబర్ E.P లో D.Hr, JDr తాలుకు షెడ్యూలు చరాస్థిని వేలంనకు తెచ్చినాడు. (E.P మొత్తం రాబట్టుకొనుటక) వేలం వాయిదా 8-10-2025 తేదిన ఉన్నది. సవాలు దారులు పై వేలం తేదిన పై కోర్టులో పగలు 10.30 గంటలకు హాజరై వేలంలో పాల్గొన వలెను.

షెడ్యూలు :

The Property Situated at J.Dr Office of Spl Dy Collector Located in office of Srisailam Project Kurnool.
1. Computers worth of Rs. 50,000/- (10 in Number)
2. Sealing fans worth of Rs. 20,000/- (10 in number)
3. Computer tables worth of Rs. 10,000/- (8 in number)
4. Chairs worth of Rs. 30,000/- (10 in number)
5. Air coolers worth of Rs. 20,000/- (2 in number)
6. Monitor worth of Rs. 10,000/- (1 in number)

D.Hr. approximate value Rs. 1,40,000/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఎ. రామసుబ్బారెడ్డి,
ఎ. ప్రభాకర్ రెడ్డి,
డి. హెచ్.ఆర్. అడ్వకేట్స్,
కర్నూలు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: KURNOOL
E.P.No. 7/2021 in L.A.O.P.No.: 35/2005

Y.Narayana Rao. ...D.Hr

- VS -

The Special Deputy Collector, S.S.P.
Land Acquisition and Rehabilitation. ...JDr

వేలం ప్రకటన

పై నెంబర్ E.P లో D.Hr, E.P మొత్తము రాగోరి JDr తాలుకు షెడ్యూలు మొబుల్ ప్రాపర్టిని వేలంనకు తెచ్చినారు. వేలం వాయిదా 16-10-2025 తేదిన ఉన్నది. సవాలు దారులు పై వేలం తేదిన పై కోర్టులో పగలు 10.30 గంటలకు హాజరై వేలంలో పాల్గొన వలెను.

షెడ్యూలు :

The Movable Property Mentioned below of Special Deputy Collector Located in office of Srisailam Project Kurnool.
1. Computers worth of Rs. 25,000/- (5 in Number)
2. Ceiling fans worth of Rs. 5,000/- (10 in number)
3. Computer tables worth of Rs. 10,000/- (10 in number)
4. Chairs worth of Rs. 3,600/- (12 in number)
5. Almarahs worth of Rs. 8,000/- (4 in number)

D.Hr. approximate value Rs. 51,600/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఎ. రామసుబ్బారెడ్డి,
ఎ. ప్రభాకర్ రెడ్డి,
డి. హెచ్.ఆర్. అడ్వకేట్స్,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం. 881/2022

పి.రామేశ్వరయ్య. ...వాది

- వర్సెస్ -

పి. భువనేశ్వర రెడ్డి Died by his L.Rs
1. పి. చిన్నమ్మ
2. పి. దినేశ్వర్ రెడ్డి
3. పి. మణికంటేశ్వర రెడ్డి. ...ప్రతివాదులు

1, 2 మరియు 3వ ప్రతివాదులకు దావా సమను

1. పి. చిన్నమ్మ భర్త లేట్ పి.భువనేశ్వర రెడ్డి
2. పి. దినేశ్వర్ రెడ్డి తండ్రి లేట్ పి. భువనేశ్వర రెడ్డి
3. పి. మణికంటేశ్వర రెడ్డి తండ్రి లేట్ పి. భువనేశ్వర రెడ్డి

అందరి ప్రస్తుత నివాసం R/o H.No.135 ఉమా మహేశ్వర నగర్, సూదిరెడ్డి పల్లి గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలోవాది, ప్రతివాదుల తండ్రి అయిన పి. భువనేశ్వర రెడ్డి, వాది దగ్గర తీసుకున్న ప్రామిసరి నోటు బాకి బాపత్తు ముందు వడ్డి, కోర్టు ఖర్చులు దావా మొత్తము రూ. 3,37,398/-, రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినాడు. ఇందులో 1,2, మరియు 3వ ప్రతివాదులైన మీకు ఆక్షేపణలు ఉన్న యెడల 14-10-2025 తేది ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున అడ్వకేటు ద్వారా గాని పై కోర్టులో హాజరె పై కోర్టులో హాజరై మీకు గల అభ్యం తరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా : 14-10-2025

బి. చంద్రుడు,
యం.సి. మద్దిలేటి,
వాది పరం అడ్వకేట్లు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ. నెం. 846/2022 ఇన్ ఓ.యస్.నెం. 881/2022

పి.రామేశ్వరయ్య. ...అర్జీదారు/వాది

-వర్సెస్-

పి. భువనేశ్వర రెడ్డి Died by his L.Rs
1. పి. చిన్నమ్మ
2. పి. దినేశ్వర్ రెడ్డి
3. పి. మణికంటేశ్వర రెడ్డి.

...రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

1,2 మరియు 3వ రెస్పాండెంట్స్‌కు నోటీసులు

1. పి. చిన్నమ్మ భర్త లేట్ పి. భువనేశ్వర రెడ్డి
2. పి. దినేశ్వర్ రెడ్డి తండ్రి లేట్ పి. భువనేశ్వర రెడ్డి
3. పి. మణికంటేశ్వర రెడ్డి తండ్రి లేట్ పి. భువనేశ్వర రెడ్డి

అందరి ప్రస్తుత నివాసం R/o H.No. 135 ఉమా మహేశ్వర నగర్, సూదిరెడ్డి పల్లి గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా.

పై నంబరు దావాలో అర్జీదారు/వాది, రెస్పాండెంట్స్/ప్రతివాదుల తండ్రి అయిన పి. భువనేశ్వర రెడ్డి మరణించినందున అతని E.L salary amount attachment before judgmen ఆర్డర్ ఇవ్వమని అర్జీదారు పై కోర్టులో అర్జీదాఖలు చేసి యున్నారు. ఇందులో 1,2,మరియు 3వ రెస్పాండెంట్స్/ ప్రతివాదులు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 14-10-2025 తేది ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున అడ్వకేటు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపు కొనవల యును. లేనియెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా : 14-10-2025

బి. చంద్రుడు,
యం.సి. మద్దిలేటి,
అర్జీదారు పరం అడ్వకేట్లు, కర్నూలు.

లక్ష్మీపేటలో రోడ్లు, డ్రైయినేజీ నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 24వ వార్డు లక్ష్మి పేట రోడ్లు, డ్రెయినేజీ నిర్మించాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో వార్డులో పర్యటించారు. సిపిఎం నాయకులు పి.గోవిందు, రమేష్, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, ఆటో యూనియన్ నాయకులు బి.రాజు, డివైఎఫ్ఐ నాయకులు రవి కుమార్ మాట్లాడుతూ... లక్ష్మీపేటలో రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వాహనదారులు, వృద్ధులు, విద్యార్థులు, రోడ్లను చూసి భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి రూ.3 కోట్లు ఇంటి పన్ను రూపంలో చేరుతోందని, వీధిలో రోడ్లు, డ్రెయినేజీల గురించి అస్సలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రస్తుతం రోడ్లు నిర్మించే కాంట్రాక్టర్లు వారే ప్లాన్ వేసుకుని, సర్వే చేసి, ఎస్టిమేషన్ సబ్మిట్ చేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఎమ్మిగనూరులోని శిథిలావస్థకు చేరుకున్న, ప్రమాదాలకు కారణమైన రోడ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు.

రోడ్ల దుస్థితి చూపుతున్న నాయకులు

ఎమ్మిగనూరులో నిరసన తెలియజేస్తున్న రావూస్ యాజమాన్యం

ప్రయివేట్ డిగ్రీ కళాశాలల బంద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని డిగ్రీ కళాశాలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని సోమవారం ఎమ్మిగనూరులోని ప్రయివేట్ డిగ్రీ కళాశాలలు బంద్ చేపట్టాయి. రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమల రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 16 నెలలుగా ఆరు విడతల ట్యూషన్ ఫీజ్ రివెంబర్స్‌మెంట్ నిధులు, ఇప్పుడు 7 విడత నిధులు కూడా రావాల్సి ఉందని తెలిపారు. ఈ ఆలస్యానికి కారణంగా డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు నిర్వహించలేక, అనేక సంక్షోభాలకు గురవుతున్నామని చెప్పారు. నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. **కోసిగిలో** ఉన్న నారాయణ డిగ్రీ కళాశాలను బంద్ చేశారు. ప్రిన్సిపల్ హుస్సేనయ్య, షేక్షావలీ, అధ్యాపకులు చౌడయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని తెర్నేకల్లు హంద్రీ వాగులో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... సోమవారం హంద్రీ వాగు బ్రిడ్జి కింద నీటిలో 36 ఏళ్ల వ్యక్తి మృతదేహం గ్రామస్తులకు కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సిఐ వంశీనాథ్, పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'అసెంబ్లీ తరహాలోనే పోలింగ్ చేపట్టాలి'

ప్రజాశక్తి - ఆదోని


తిమ్మప్పకు సన్మానం చేస్తున్న ముజీబ్ అహ్మద్

అసెంబ్లీ పోలింగ్ తరహాలోనే ఓటుహక్కు వినియోగించుకునేలా జాబితా రూపొందించాలని టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప తెలిపారు. ఇటీవల టిడిపి పట్టణ అధ్యక్షులుగా ఎంపికైన తిమ్మప్పకు సోమవారం ఆదోనిలోని ఆయన నివాసంలో తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి ముజిబ్ అహ్మద్ పూలమాల, శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వార్డులో ఉన్న వారి పేర్లు మరోచోట ఓటరు జాబితాలో ఉండడం వల్ల ఓటు వేసేందుకు పోలింగ్ రోజున ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ఏ విధంగా ఓటరు జాబితా రూపొందిస్తారో ఆ తరహాలోనే కౌన్సిలర్ ఎన్నికలకు కూడా అమలు చేయాలని కోరారు. పట్టణంలో క్షేత్రస్థాయిలో పర్యటించి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

దసరా నవరాత్రోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-దేవనకొండ

దేవనకొండలో శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీచెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో సోమవారం దుర్గమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. మొదటి రోజు బాలాత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు రాజశేఖర్, శేఖర్, బాలు, ఓబులేసు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని గోనెగండ్ల బైపాస్ సర్కిల్ అభివృద్ధి పనులు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. సోమవారం అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలను పాటించాలని పేర్కొన్నారు. డిఇఇ రాజు నాయక్, ఎఇ శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే స్వచ్ఛత హి సేవలో భాగంగా పట్టణంలోని సున్నంబట్టి ఏరియాలో ఉన్న దోభీఘాట్‌లో కమిషనర్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించి శుభ్రం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

-టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి అభివృద్ధికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అండగా ఉంటామని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప తెలిపారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీ సీనియర్ కార్యకర్త ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని, పార్టీతోపాటు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. రాజబాబు, గోవిందు, రఘురామ్, భీమయ్య, పుగ్గి నాగప్ప, ఆదాము, ఓబులేసు, గురులింగ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఉల్లి రైతు కష్టాలు తీర్చిన ముఖ్యమంత్రి బాబు

- మంచాల సొసైటీ ఛైర్మన్ రామకృష్ణా రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేల పరిహారం ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయమని మంచాల సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణా రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని మాల్లపల్లి గ్రామంలో టిడిపి నాయకులు, ఉల్లి రైతులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఉల్లి రైతుకు హెక్టారుకు రూ.50 వేలు అందించనున్నట్లు, దళారులతో సంబంధం లేకుండా పంటను ఎవరికైనా అమ్ముకోవచ్చని తెలిపారు. ఉల్లి రైతులు హెక్టారుకు రూ.85 వేల నుంచి రూ.1.23 లక్షల వరకు పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధరలు రావడం లేదని చెప్పారు. దానిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.100 కోట్లు వెచ్చించి రైతులను ఆదుకుంటున్నారని తెలిపారు. టిడిపి నాయకులు గోపాల్ రెడ్డి, పెద్దకడబూరు మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, జిల్లా కబడ్డీ ఛైర్మన్ చావిడి వెంకటేష్, కల్లుదేవకుంట సొసైటీ డైరెక్టర్ లక్ష్మయ్య, పవన్ కుమార్, వగరూరు గోపాల్, వీరేష్, వేమిరెడ్డి, సౌలహళ్లి శివరాముడు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణను విరమించుకోవాలి

- వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు జయపాల్

ప్రజాశక్తి - కౌతాళం

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు జైపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయం వల్ల భవిష్యత్తులో దళిత వర్గాలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. దళిత విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదని, దానిని మరోసారి పునరాలోచించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలపై పిపిపి విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

ఎల్ఎల్‌సికి మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కోసిగి

అధికారులు ఎల్ఎల్‌సి మరమ్మతులు చేపట్టారు. మండలంలోని కోల్మన్ పేట గ్రామ సమీపంలో ఉన్న 7ఎల్ కాలువకిరువైపులా ఉన్న ఒక కట్ట తెగిపోయింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నీరు వృథాగా వంకలో పోతోంది. 'తెగిన కాలువకట్ట - నీరు వృథా' అన్న శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఎల్ఎల్‌సి ఎఇ రవి ప్రసాద్, లస్కర్లు సోమవారం కాలువ కట్టకు ఇరువైపులా ఇసుక బస్తాలు వేసి జెసిబితో మట్టి వేసి మరమ్మతులు చేపట్టారు. నీటి వృథాను అరికట్టారు. ఈ కాలువలో కొద్ది దూరంలో వినాయక విగ్రహాన్ని కాలువలో వేయడంతో నీరు ముందుకు వెళ్లకుండా, నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో కట్ట తెగిపోయిందని తెలిపారు. అక్కడున్న వినాయక విగ్రహాన్ని తొలగించి కాలువలో కంపచెట్లు, గడ్డి తీయించినట్లు చెప్పారు. ప్రజాశక్తి దినపత్రికకు, అధికారులకు గ్రామస్తులు అభినందించారు.

కాలువకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

ఉద్యోగుల సంక్షేమానికి అండ

- ఫర్టిలైజర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అశోకనందరెడ్డి

మాట్లాడుతున్న అశోకనంద రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

అగ్రికల్చర్ అనుబంధ కంపెనీల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల సంక్షేమానికి తమవంతు సహకారం అందిస్తామని ఫర్టిలైజర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అశోకనందరెడ్డి తెలిపారు. సోమవారం ఆదోనిలో ఓ హోటల్‌లో అగ్రి ఇన్‌పుట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా కొ్ట్రేష్, ఎమ్మిగనూరు శివకుమార్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల వద్దకు వెళ్లి ఎక్కువ మోతాదులో ఎరువులు, రసాయన మందులు వాడకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అందరూ యూనియన్‌లో చేరి సభ్యత్వం పొంది అక్కడ లభించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇబ్బందుల్లో ఉన్న వారికి డీలర్ అసోసియేషన్ సహకారం అందిస్తుందని తెలిపారు. ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర స్వామి, వీరేష్, గీతా గౌడ్, హనుమంతరావు, ఖాజా, లక్ష్మణ్, ధర్మేందర్ రెడ్డి, ఎమ్మిగనూరు మాజీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి ఉన్నారు.